



మల్లాది రమాంజలి

# తనదాకా వస్తే...

"ఇదేమీ బాగా లేదన్నయ్యా! వచ్చిన సంబంధమల్లా ఈ రకంగా తిప్పికొడుతుంటే... వసూకి పెళ్లి అయ్యేదెట్లా...!"

"మీ వదిన నీకు చెప్పి పంపిందా! ఒకచోట పిల్లను ఇచ్చు కోవడమంటే ఆషామాషీ వ్యవహా రమనుకున్నావా! అటు ఏడు తరాలూ, ఇటు ఏడు తరాలూ... అంటారు. పిల్లవాడి మంచీ చెడ్డా, ఉద్యోగం సద్యోగం చూసుకో వద్దూ... దానికి వయస్సేం మించి పోలేదు... నాకు తెలుసు ఎప్పుడు పెళ్లి చెయ్యాలో" మొండిగా అన్నారు శేషగిరిరావుగారు.

"అది కాదన్నయ్యా! వసూ వెనకాల ఇంకా ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు... దీనికి త్వరగా అయితేనే కదా... మిగతా వాళ్లకి అయ్యేది... ఈసారి సంబంధం చూసేటప్పుడు నన్ను కూడా తీసుకు వెళ్లు... నేను మాట్లాడతాను" మెల్లగా అన్నాడు శ్రీహరి.

"సరే సరే నీవు రావటం నాకేం అభ్యంతరం లేదు... అక్కడికొచ్చి నేను వివరాలు మాట్లాడుతుంటే నువ్వు చాదస్తం అంటూ అడ్డురావద్దు" ఖండితంగా అన్నారు.

"అలాగే అన్నయ్యా!... ఇంకో విషయం... వసూకి సూటవ్వని సంబంధాలు రెండోదానికి చూడు... కుదిరితే ఇద్దరికీ ఒక్కసారే చెయ్యవచ్చు."

"మొన్న బాపట్ల సంబంధం చూసినపుడు పెళ్లికొడుక్కి మెడ కింద మచ్చలున్నాయని నేను గొడవపెట్టినా మీ వదిన పట్టించుకోలేదు. ఆమె మాటలు వినకుండా నేను వెళ్లి పక్కవాళ్లని ఎంక్వయిరీ చేస్తే అతనికి ఈమధ్యనే 'లివర్ ప్యాచెస్' వచ్చినాయని తెలిసింది... మరి సరిగా చూడకుండా... 'గుడ్డెద్దు' వ్యవహారంలా పెళ్లిళ్లు చేసేస్తే నష్టపోయేది ఎవరు? ముందు మన పిల్ల, తర్వాత మనమూ... కాబట్టే ఈ విషయంలో ఆచి తూచి అడుగు వెయ్యాలి"

"అతను బాగా చదువుకుని సిటీలో నాలుగూ చూసినవాడని అతన్ని మీవెంట తీసుకువెళ్లమంటున్నాను... అంతేగానీ నాకు మాత్రం మన పిల్లకి మంచి సంబంధం రావాలని ఉండదా" శ్రీలక్ష్మి నిష్టూరంగా అన్నది.

"ఆ...ఆ... మరిదిని వెనకేసుకు రానక్కర్లా... వాడినీ రమ్మని అంటూనే ఉన్నాగా"

"మొన్న మా అక్క కూతురి పెళ్లిలో మన పిల్లకు అసలు పెళ్లి గీత ఉందో లేదోనని అందరూ ఆడిపోసుకుంటుంటే నా బాధ చూడలేక వసూ సంబంధాల విషయంలో మరిది కల్పించుకున్నాడు గానీ... అతను ఏం తప్పు చేశాడని మీరలా అంటున్నారు?"

"సరే సరే... ఇక ఆపు... పొద్దు పోతోంది... వాడికీ, నాకూ వడ్డించెయ్యి... రేపు విజయవాడ వెళ్లాలి... అక్కడేదో మంచి సంబంధం ఉన్నదట" అంటూ కాళ్లు కడుక్కోడానికి పెరట్లోకి నడిచారు శేషగిరిగారు.

* * *

ఇల్లు కట్టి చూడు... పెళ్లి చేసి చూడు... అన్నారు పెద్దలు... మంచి ఇల్లు మంచి స్థలంలో, వాస్తు ప్రకారం సౌకర్యంగా కట్టుకోవడం ఎంత శ్రమతో కూడుకున్న పనో, మంచి పెళ్లికొడుకును చూసి పిల్లకు పెళ్లి చెయ్యడం అంతే కష్టం... వసూ పెళ్లి విషయంలో చాలా కష్టపడుతున్నారు శేషగిరిగారు... అమ్మాయికి దేనికీ లోపం లేకపోయినా, పెళ్లి చూపుల్లో అమ్మాయిని లోపలికి తీసుకొని వెళ్లి కాళ్లు, వేళ్లు పరీక్ష చేస్తుంటే చిర్రెత్తుకొచ్చేది ఆయనకి... మరీ ఇంత సందేహాల పుట్టకు నా కూతురిని ఇవ్వనంటూ మొండికేశారు. మరో సంబంధం తాంబూలాల దాకా వచ్చాక పిల్లవాడు ఎవరో అమ్మాయిని ఇంత క్రితమే ప్రేమించాడట... అనే 'మధ్యవర్తి' కబురు... పోనీ పెళ్లికి ముందుగానే విషయం చెప్పి మా నెత్తిన పాలు పోశాడని అనుకుంటుండగానే మచ్చలేని మా అమ్మాయికి... ఆ మచ్చల పెళ్లికొడుకు ఒకడు... ఈ రకంగా అమ్మాయి పెళ్లికోసం తిప్పలు పడుతుంటే... ఒరే గిరీ... నీ పిల్లను వృద్ధకన్యను చేస్తావే మిత్రా... అనే బంధువుల ఈసడింపులు... దేనికీ లొంగ లేదు శేషగిరిగారు...


"ఏమిటన్నయ్యా! మరీ ఇంత చాదస్తాలకి పోతే పిల్లకు పెళ్లెప్పుడు చేస్తావ్...? పిల్లవాడు చక్కగా చదువుకొని నాలుగు రాళ్లు సంపాదిస్తే చాలదా! తరాలన్నీ తిరగేస్తూ పోతే దానికి వయసయిపోతుంది... నా పిల్లలకు నేను త్వరగా పెళ్లిళ్లు చేసేస్తాను... ఇంత ముదర పెట్టుకోను... మీనమేషాలు లెక్కపెడుతూ కూర్చుంటే వృద్ధకన్యలంటారు" తమ్ముడు శ్రీహరి మాటలు పట్టించుకోలేదు గిరిగారు.

వసూకి అందం, గుణం, చదువు, తెలివి అన్నీ ఉన్నాయి. కానీ చూసిన సంబంధమల్లా ఏదో ఓ రూపేణా కలిసిరాకపోవటంతో శ్రీలక్ష్మి దిగులుపడుతోంది. వసూకి పాతిక సంవత్సరాలు దాటుతున్నాయి. ఆమె వయస్సు పిల్లలందరికీ పెళ్లిళ్లు అయి పిల్లల తల్లులవుతుంటే... ఇంకా తమ ఇంట్లో మంగళవాయిద్యాలు ఎప్పుడు మ్రోగుతాయో... ఆ శుభగడియ ఎప్పుడు వస్తుందానని ఎదురుచూస్తోంది శ్రీలక్ష్మి.

వసూకి విజయవాడ సంబంధం కుదరటంతో అందరూ తేలిగ్గా నిట్టూర్చారు. వారం రోజుల్లో పెళ్లి అయిపోవాలనే మగపెళ్లివారి కండిషన్‌తో ఆ ఇంట్లో పెళ్లి సందడి మొదలైంది... గుమ్మాలకు పచ్చని తోరణాలూ, పసుపు, కుంకం, పచ్చని తాటాకు పందిరి, ఇంటికి కొత్తగా వేయించిన రంగుల సువాసనలతో, రంగురంగుల ముగ్గులతో కళకళలాడుతోంది ఆ ఇల్లు. వసూ పెళ్లి అనుకున్న ముహూర్తానికి రంగరంగ వైభవంగా జరిగిపోయింది. కల్యాణమొచ్చినా, కక్కొచ్చినా ఆగదని వసూకి కాస్త ఆలస్యమైనా మంచి సంబంధం వచ్చిందని తృప్తిపడింది శ్రీలక్ష్మి.

ఆ తర్వాత లలిత, గీతల పెళ్లిళ్లు కూడా వెతికి వెతికి మంచి సంబంధాలే చేశారు గిరిగారు. ఇవన్నీ పదేళ్ల నాటి సంగతులు...

ఇప్పుడు గిరిగారు ఆరుగురు మనవళ్లు, మనవరాళ్లను ఎత్తుకున్నారు... పదవీ విరమణ చేశారు... చీకూ, చింతా లేని జీవితం... దర్జాగా గడిపేస్తున్నారాయన.



సిటీ లో
మంచి హోదాలో
ఉన్న శ్రీహరి ఏనాడూ
అన్నగారి సలహా తీసుకోడు... అతని దృష్టిలో అన్న గారు పరమ ఛాందసుడు, అమాయకుడు...

అన్నగారి పిల్లల కంటే పది పన్నెండు సంవత్సరాలు చిన్నవాళ్లయిన ఆయన పిల్లలు సీత, సంగీత వయస్సుకొచ్చారు. చదువులయి, ఉద్యోగాల కొచ్చారు... పదేళ్ల కాలంలో పెళ్లిళ్ల వ్యవహారాల్లో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. అమెరికా పెళ్లి కొడుకైతేనే పిల్ల సుఖపడుతుందనే ఆలోచనే ప్రతి తల్లిదండ్రులకీ.. అదోగొప్ప... సంఘంలో అదో గౌరవం... ఇంటర్‌నెట్‌లో పెళ్లి సంబంధాలు, వెబ్‌కామ్‌లో పెళ్లిచూపులు, ఛాటింగ్‌లూ వగైరా వగైరా... రకరకాల మాట్రిమోనియల్స్ వెలిసినాయి. వేలమంది తల్లిదండ్రుల్లాగానే మోజుపడి పెద్దకూతురు 'సీత'కి అమెరికా సంబంధం కుదిర్చేశాడు శ్రీహరి. శుభలేఖలు అచ్చువేయించేసి, మొదటి శుభలేఖ అన్నగారికి ఇచ్చెయ్యాలంటూ భార్యతో సహా గడపలో అడుగుపెట్టే వరకూ తమ్ముడి కూతురు సీత పెళ్లి కూతురవుతున్నట్లు తెలీలేదు అన్నగారికి...

శుభలేఖ చూసి చాలా సంతోషించారు గిరి గారు... "ఏరా! పిల్లవాడి కుటుంబం గురించి ఎంక్వయిరీ చేశావా! మంచివాళ్లేనా! మన అమ్మాయి ఎక్కడో సప్తసముద్రాలు దాటి ఆ దేశానికి కాపురానికి వెళ్లాలి... పిల్లను ఒక్కసారి చూసి రావాలంటే లక్షలతో పని... వెళ్లిందంటే ఏ రెండేళ్లకో కసారో గానీ ఇక్కడికి రావడానికి కుదరని పని"

"మరేం ఖంగారు లేదన్నయ్యా! అన్నీ వాకబు చేసే కుదిర్చాను... నా స్నేహితుడు నారాయణరావు కొడుకు అక్కడే ఉంటున్నాడు... వాడు సీతకు మంచి ఫ్రెండ్... వాడు అప్పుడప్పుడు సీతను చూస్తూ ఉంటాడు... పెళ్లికి మీరంతా తప్పనిసరిగా రావాలి."

"అయ్యో! అదేమన్నమాట... అందరం వస్తాం"

"ఏం వదినా! నువ్వేం మాట్లాడటం లేదేమిటి?"

"ఇందులో నేను మాట్లాడేదేముంది శ్రీహరీ... చక్కగా పిల్లకి చిన్నవయస్సులోనే మంచి సంబంధం కుదిర్చావు... అంతకంటే ఇంకేం కావాలి... తప్పకుండా పెళ్లికి నాలుగు రోజులు ముందుగానే వచ్చివాలిపోనూ..."

* * *

సీత పెళ్లిలో అడుగడుగునా మగపెళ్లివారి గొంతెమ్మ కోర్కెలను ఓపికగా తీర్చాడు శ్రీహరి. అత్తగారి లాంఛనాలతో పాటు, ఆడపడుచు లాంఛనాలకు, పెళ్లి ఖర్చులకు పది లక్షలకు పైగానే ఖర్చుపెట్టాడు. బంగారం ధర ఆకాశాన్నంటుతోందంటూ ఓ సన్నపాటి గొలుసు పెట్టి తప్పించుకున్నారు మగపెళ్లివారు.... మీ అమ్మాయికి మీరేం పెట్టదల్చుకున్నారో పెట్టండి... మీకున్నదంతా వాళ్లిద్దరికే కదా!... అనే ముక్తాయింపొకటి...

"ఏంటయ్యా హరీ... లక్షల కట్నం తీసుకొని కంటితుడుపుగా ఓ గొలుసు పెట్టి ఊరుకున్నారు... ఇంకేదైనా నగ పెట్టండని అడగవయ్యా" అని వదినగారంటే... అతను సంపాదించే దాలర్లన్నీ మన సీతవే కదొదినా... మరీ కక్కుర్తి వ్యవహారమనుకుంటారేమోననే మరిదిగారి మొహమాటం.

మా వాడు ఈమధ్యే ఉద్యోగంలో చేరాడు కాబట్టీ టికెట్ డబ్బు అంత ఇవ్వలేడు... మీ పిల్లను మీరే పంపు కోండంటే మరి తప్పుతుందా... వేలు ఖర్చు చేసి కూతురిని అమెరికా ఫ్లైట్ ఎక్కించాడు శ్రీహరి.

* * *

సీత పెళ్లయి కాపురానికి వెళ్లి అప్పుడే ఆరు నెలలు కావస్తోంది... శ్రీకాంత్ ఆమెను బాగానే చూసుకుంటున్నాడు... సీత సంతోషంగానే ఉన్నది గానీ... క్రమంగా శ్రీకాంత్‌లో ఏదో లోపం, అసంతృప్తి కనపడుతూ బాధపెట్టసాగిందామెను.

"సీతా! నువ్వొచ్చాక నాకు ఖర్చు బాగా పెరిగింది సుమా! అసలు మా నాన్నకు నేను ఇక్కడి అమ్మాయినే చేసుకుంటానని చెప్పాను... కానీ... నా మాట వినలేదు... ఇద్దరం సంపాదిస్తే

ఎంత దర్జాగా బ్రతకవచ్చో తెలుసా...! నీ వల్ల నాకు ఖర్చేగానీ, ఆదాయం లేదోయ్" అంటుంటే...

శ్రీకాంత్ సరదాగా అంటున్నాడనుకుంది సీత... రానురాను అతను అవే మాటలు రిపీట్ చేయడంతో నమ్మక తప్పలేదు...

"నేను ప్రొద్దుటే వెడితే రాత్రికి గానీ ఇంటికి రాను... రాత్రికి నేను ఇంటికి వచ్చేవ రకూ జ్యూస్‌లతో గడిపెయ్యి... నేనొచ్చాక వంట చేద్దువు" అనే భర్తను వింతగా చూసింది సీత.

శ్రీకాంత్ ఖర్చు గిట్టనివాడే కాకుండా, అనుమానం మనిషి కూడా... శ్రీనాథ్ సీతను అప్పుడప్పుడు చూడటానికి వచ్చినా అతనికి అనుమానమే... నేను ఆఫీస్ నుంచి వచ్చే ముందే వచ్చాడా మీ ఫ్రెండ్... ఎంతసేపయింది అతను వచ్చి? ఏమిటి మీ ఇద్దరూ అంతలా నవ్వేసుకుంటు న్నారు? అతనుండగా ఇంకా నేనెందుకు నీకు..? పెళ్లి కాకముందు నుంచీ ఉందా మీ వ్యవహారం? అనుమా నాలూ... అవమానాలూ... చెంపదెబ్బలు... భోజనం చేసిన రోజులు వేళ్లతో లెక్కించవచ్చు...

చిక్కి సగమైన సీతను అతి బలవంతంగా తన ఇంటికి తీసుకువెళ్లాడు శ్రీనాథ్... స్వంత చెల్లెలిలా ఆద రించి అన్నం పెట్టాడు... తన ఇంటి ఆడపడుచులా ఆమె కన్నీటిని తుడిచింది అతని శ్రీమతి సురేఖ...

తిరిగి 'ఇండియా' వెళ్లిపోతానంది సీత. శ్రీకాంత్‌కి బుద్ధి చెప్పాలంటే ఆమె అక్కడే ఉండాలనీ... తనని ఎమ్.ఎస్. చేయమని సలహా ఇచ్చారా దంపతులు.

* * *

తన భార్యని తనతో చెప్పకుండా తీసుకువెళ్లినం దుకు కోపంతో శ్రీనాథ్ ఇంటిమీదికొచ్చాడు శ్రీకాంత్.

శ్రీనాథ్ దంపతులు, సీతను సరిగా చూసుకోమని శ్రీకాంత్‌కు నయానా, భయానా చెప్పారు. అప్పటికి సరే నన్నాడు శ్రీకాంత్. మళ్లీ పరిస్థితి షరా మామూలే... తట్టు కోలేకపోయింది సీత. తన పరిస్థితిని వివరిస్తూ శ్రీనాథ్ ఇంటి నుంచి తండ్రికి కాల్ చేసింది... విస్తుపోయాడు శ్రీహరి... అమెరికా సంబంధం చేస్తే పిల్ల సుఖపడుతుం దని తలచిన ఆయన ఆశలన్నీ అడియాశలయినాయి... తన గోడును అన్నగారికి చెప్పుకొని, తన మనస్సులోని బాధను తీర్చుకుందామని బయలుదేరాడు.


అంతా విన్న గిరిగారు దీర్ఘంగా నిట్టూర్చారు... గతంలో తమ్ముడు తనను అన్న మాటలు గుర్తుకొ చ్చాయి ఆయనకు... కానీ... అంతటి దుఃఖంలో ఉన్న తమ్ముడికి అవన్నీ గుర్తుచేసి ఇంకా బాధపెట్టదలుచు కోక...


"బాధపడకురా హరీ... అమ్మాయిని అక్కడే ఉండి చదువుకోమను... చదువు కాగానే ఏదో ఉద్యోగం రాక పోదు... ఆ ఉద్యోగం చూసైనా అతను సీతను ఏలుకుం టాడు... ఈ మధ్యనే పేపర్‌లో అనేక వార్తలు చది వాను... దూరపు కొండలు నునుపని... మన పిల్ల ఏదో అమెరికన్ డాలర్లలో మునిగి తేలుతుందని అపోహపడతాం... కానీ... అందరూ మంచివాళ్లే అనుకుంటే ఎలా...! ఆ మధ్య ఎవరో ఓ పనికిమాలిన వాడు... భార్యను ఎయిర్‌పోర్ట్‌లోనే వదిలేసి పోయాడట... ఇంకొకడు అంతక్రితమే పెళ్లి చేసుకొని... తండ్రి కన్నీళ్లు తుడవడాని కన్నట్లు మరో పెళ్లి చేసుకొని పాపం ఆ పిల్లను టార్చర్ పెట్టడం... ఇలా ఎన్నో రకాల కథలు... కాబట్టీ... నీకు చాదస్తం అనిపించినా... ఓ సంబంధం అనుకుంటే అటు ఏడు, ఇటు ఏడు తరాలు చూడా ల్సిందే... రేపే బయలుదేరి వెళ్లి శ్రీకాంత్ తల్లి తండ్రులను కలిసి పరిస్థితి వివ రిద్దాం... మా పిల్లకు ఏం జరిగినా మీదే బాధ్యత అని చెపుదాం... వాళ్ల అబ్బాయిని దారిలో పెట్టవలసిన బాధ్యత వాళ్లదే అని చెపుదాం... వేసిన ముడిని గట్టి చెయ్యడానికి ప్రయత్నించాలి గానీ... ముడి విడదీయడా నికి ప్రయత్నించకూడదు" అన్నారు.

"నీవు చెప్పింది నిజమేనన్నయ్యా! నీ మాట వినక నేను చాలా నష్టపోయాను... ఊబిలో ఇరుక్కుపో యాను... సీత బ్రతుకును ఓ కసాయి చేతుల్లో పెట్టాను... కనీసం సంగీత పెళ్లి అయినా నీ చేతుల మీదుగా అవనీ అన్నయ్యా" అంటూ తల వంచుకు న్నాడు శ్రీహరి.

"ఒక తప్పటడుగు వేశావ్... ఆ అడుగు సరిచేసుకో కుండానే మరో అడుగు వెయ్యకు... సంగీత పెళ్లి సంగతి తర్వాత ఆలోచిద్దాం... ముందు సీత సంసారం చక్కబర చాలి..." గంభీరంగా అంటూ లోనికి నడిచారు గిరి గారు.

○



# తమిళ తెరపై ప్రభాస్?

**యంగ్** రెబల్ స్టార్ ప్రభాస్ త్వరలోనే తమిళ తెరకి పరిచయం కాబోతున్నాడని వార్తలు వస్తున్నాయి. తమిళ దర్శకుడు సముద్రఖణి దర్శకత్వం వహించే ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి నిర్మాణం జరుపుకుం దిట. తాజాగా 'డార్లింగ్' సినిమా విజయంతో హుషా రుగా వున్న ప్రభాస్ అభిమానులకు ఈ కొత్త వార్త మరింత ఆనందాన్ని కలిగిస్తుంది కదా! ప్రస్తుతం దశరథ్ దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మిస్తున్న కొత్త చిత్రంలో ప్రభాస్ హీరోగా నటిస్తున్నాడు.